పడినా-యీ లోకంలో మొదటిరాత్రి అనుభవం తనకొక్క_ర్తెకే దక్క_నందుకు మొదటిసారిగా బాధపడింది.

మూడు రాత్రులు శోభ మిగతా ప్రపంచాన్ని మరిచిపోయినట్టు గది తలుపులు గొళ్లెం పెట్టుకుని మొగుడితోటిదే లోకం అన్నట్టు ప్రవర్తించడం చూసి విస్తుపోయింది. కావమ్మగారు చటుక్కున రావడం ఏ కాఫీయో, టిఫినో, నీళ్లో పట్టుకెళ్ళడం మళ్ళీ గొళ్ళెం పెట్టేసుకోవడం-అక్క_డనించి ఒకటే కిలకిలలు, పకపకలు-చూసి చూసి వారంరోజులు పోయాక మొగుడు వెళ్ళాక శోభని దగ్గిరలాక్కుని కూర్చో పెట్టుకుని అన్నాళ్ళుగా, అన్నేళ్ళుగా ఆవిడ మనసులో కదలాడే సందేహాలన్నీ బయటపెట్టింది. పన్నెండేండ్లదానిలో తన మొదటి రాత్రి అనుభవం, మొదటి రాత్రే కాదు మూడేళ్ళ రాత్రుల అనుభవం అనుభూతి చెప్పింది- 'అమ్మడూ మొదటి రోజు నీకు భయం వేయలేదే తల్లీ-అలా నవ్వుకుంటున్నారు. అతను....అతను నిన్నేంచెయ్యలేదా-బాధకల్గ లేదా ఏమోతల్లీ ఇప్పటికీ నాకారోజు తలుచుకున్నా-ఆ రోజేకాదు ఏ తలుపు గొళ్ళెం చూసినా గుండెదడే అమ్మా, యిన్నాళ్ళయినా ఆ దడ తగ్గలేదే—రాకాసిలాంటి ఇంతింత గొలుసుల గొళ్ళెంతో నన్ను బంధించిన ఆ గొళ్లెం చూస్తే.... అమాయకంగా చెప్పతున్న మామ్మని జాలిగా, సానుభూతిగా చూసి నవ్వింది శోభ.

'మై డియర్ మామ్మా-తలుపు గొళ్లెం కేవలం మనుష్యులని బంధించేదిగా మాత్రమే నీకు తెల్సు, కాని మనసులని బంధించడానికీ ఉపయోగిస్తుంది మామ్మా-ఐ పిటీ యు....' అంది యింకేం చెప్పలేక.

★

# గు ర్ర పు క ళ్ళెం

రాజాధిరాజ....రాజమార్తాండతేజ... వంధి మాగధులు స్తోత్రంచేసే రాజాధి రాజు కాకపోయినా రంగాపురం జమిందారు రాజా రావుబహద్దూర్ రంగరాజుగారి దివాణం—రాణివాసంతో, దాసదాసీ జనంతో, విందులు, విలాసాలు, నాట్యాలు, అతిధి అభ్యాగతులతో కళకళలాడేది—ఆయనగారి ముఖ్య హాబీ గుర్రపు స్వారి.

ఎంత ఖర్చయినాసరే మంచి గుర్రం కనిపిస్తే కొనకుండా వదిలే వారుకారు. అర డజనుకి తక్కువ కాకుండా నల్లగా, ఎత్తుగా, బలంగా నిగ నిగలాడే గుర్రాలు సాలలో యెప్పుడూ వుండేవి. వాటి సంరక్షణ, మాలిష్‌కి ప్రత్యేక మనుషులు. రోజూ ఉదయం సాయంత్రం గంట స్వారీ చేసేవారాయన. తెల్ల దొరలు అతిధులుగా వచ్చి నపుడు గుర్రపు పందేలుండేవి. ఆయన కుటుంబంలో ప్రతి ఒక్కరు ఆడ మగ అందరూ ఐదో ఏటనించి గుర్రపు స్వారీ నేర్చుకోవాలసిందే. రేసుల సీజనులో సిటీకి వెళ్ళి రేసులలో పాల్గొనడం ఆయనకున్న వ్యసనాలలో ఒకటి. గుర్రాల కయితేనేం, వాటి పోషణకైతేనేం, రేసులకైతేనేం, పాలీనా వేలకి వేలు ఖర్చుపెట్టే వాడాయన.

ఈ కథంతా ఈనాటిదికాదు. ఆ రంగరాజుగారు పోయి ఏభై ఏళ్ళు అయింది. ఆయన కొడుకు వెంకటపతిరాజుగారూ కాలధర్మం చేసి పదేళ్ళయింది. వెంకటపతి రాజుగారి సుపుత్రుడు రమేష్‌చంద్రుడు. రమేష్‌చంద్ర రాజా కాదు, ఉత్త రమేష్ చంద్రుడే అతను. వెంకటపతిరాజుగారి హయాములోనే జమిందారీలు పోయాయి. భరణాలు ఏర్పడ్డాయి. రంగరాజుగారితోటే సగం జమీ ఆయన వ్యసనాలకి, సరదా లకి, విలాసాలకి తరిగిపోయింది. ఆయన కొడుకు వెంకటపతిరాజా మిగిలినది కర్పూరంలా వెలిగించాడు. ఇప్పుడు ఆ దివాణం కళకళలాడడంలేదు. ఆ దాస దాసీ జనం లేరు. విందులు, వినోదాలు లేవు. దివాణం సున్నానికైనా నోచుకో కుండా పాడుపడినట్లయిపోయింది. ఆ గుర్రపుశాలలో గుర్రాలన్నీ పోగా ఒకే ఒక గుర్రం మిగిలింది. అది రమేష్‌చంద్రగారి గుర్రం. అది ఏమయినా సరే అమ్మ డానికి వీలులేదని పట్టు పట్టగా తోడులేనిదానిలా ఒకే గుర్రం మిగిలింది.

రమేష్‌చంద్ర ఈ దేశంలో చదువు నచ్చక (వంటబట్టక) విదేశంలో బిజినెస్ మేనేజ్‌మెంట్ కోర్సు చదవడానికి వెళ్ళి పదిహేను రోజుల క్రితమే స్వదేశం, స్వగ్రామం తిరిగి వచ్చాడు. రావడం పెద్ద ప్లానుతోనే వచ్చాడు. ఆ గ్రామంలో భూములు, ఆస్తులు అన్నీ అమ్ముకుని సిటీ వెళ్ళి ఓ రీ రోలింగ్ ఫాక్టరీ స్థాపించా లని, ఆ విధంగా చదివిన చదువుని సార్థకపరచుకోవాలని అనుకున్నాడు. విదేశా లలో వుండివచ్చాక దర్టీ ఇండియాలో అందునా దర్టీ విలేజిలో వుండాలంటే అతనికి ముళ్ళమీద వున్నట్టుంది. లంకంత కొంపకి ముసలితల్లి సుభద్రాదేవి—ఇద్దరు దాసీలు, ఇద్దరు నౌకర్లు....వూర్లో ఎటు చూసినా పచ్చని పొలాలు, చుట్టూ కొండలు-రైతులు, ఆవులు, గేదెలు—తప్ప సివిలైజ్‌డ్ ఎట్‌మాస్ఫియర్ లేని ఆ దర్టీ వూర్లో దినమొక యుగంలా వుంది. ఆస్తులు అమ్ముకు వెళ్ళిపోయే ఆ కొద్దిపాటి వ్యవధికూడా భరించలేనిదిగా వుందతనికి. ఎంతకని పుస్తకాలు చదవడం, ఎంత కని రేడియోగ్రాం వినడం! ఉదయం గంట, సాయంత్రం గంట గుర్రపు స్వారీ

రాత్రి డ్రింక్స్....రికార్డ్సు-పుస్తకాలు తిండి-నిద్ర—పదిరోజులకే యీ జీవితం విసుగెత్తి ఎప్పుడు పోదామా అని వుంది. ఫారిన్‌లో అలవాటయిన మదిరతో పాటు మగువకోసం అతనికి శరీరం తపిస్తూంది. ఇదే ఏ సిటీలోనో అయితే పర్సు బరువునిబట్టి ఓపికనిబట్టి. కావల్సినవారిని ఎన్నుకోవచ్చు. ఈ డర్టీ విలేజ్‌లో పేడ పిసుక్కునేవాళ్ళు తప్ప ఎవరున్నారు? సాయంత్రం గుర్రపు స్వారితో వంటినిండా చెమట పట్టాక, వేడినీళ్ళ టబ్ బాత్ తరువాత వెచ్చవెచ్చని విస్కీ-తరువాత అతనికి యింకా వెచ్చనిదేదో కావాలనిపించేది. కావల్సింది దొరక్క—నిద్రపట్టక.... పక్కమీద దొర్లి....తన మత్తులో నిద్రలోకి జారేవాడు. గత పదిహేనురోజులుగా అదే రొటీన్‌తో విసిగెత్తిపోయిన అతనికి....

ఆ తెల్లారి....అంటే అతని సంభాషణలో....పుదయం తొమ్మిదింటికి లేవగానే....కిటికీలోంచి....ఓ జవ్వని దర్శన మిచ్చింది. బంతిపూవు రంగుచీరకి ఎర్రంచు. పచ్చ జాకెట్టు-జడలో చామంతులు....నెత్తిన పచ్చ గడ్డి మోపుతో వయ్యారంగా గుర్రాలశాల వైపు వెడుతూంది. గుర్రాలశాలలో రంగడు గుర్రానికి మాలిష్ చేస్తున్నాడు. దూరంనించే చూసినా రమేష్ కళ్ళల్లో కాంతి వచ్చింది ఆమెని చూడగానే. యిన్నాళ్ళకి తను వెతుకుతున్నదేదో దొరికిందనిపించింది. బ్రష్ నోట్లో పెట్టుకునే చకచక మేడదిగి గుర్రాలశాలవైపు వెళ్ళాడు. గడ్డిమోపు కింద పడేసి వంగుని గడ్డి విప్పి గుర్రం ముందు వేస్తూంది. వంగున్న ఆమె వంపు సొంపులు చూసేసరికి రమేష్ రక్తం వేడెక్కింది. చామనచాయ అయితేనేం ఆమె మొహంలో మంచి కళ వుంది. పెద్ద పెద్ద కళ్లు—తీర్చినట్లున్న కనుబొమలు. ముక్కున ఒంటి తెల్లరాయి ముక్కుపుడక. వంకుల జుత్తు లొంగక చెల్లాచెదరై నుదుటిని పడుతూంది. ఏదో నవ్వుతూ రంగడితో మాట్లాడుతూంటే తెల్లటి పలువరస తళుక్కుమంది. పెదాలు కాస్త నల్లగా వుంటేనేం ఆ పెదాలలో, కళ్ళలోనే ఏదో ఆకర్షణ వుందనిపించింది రమేష్‌కి. ఆ ఎత్తు, లావు, నడుం, అబ్బ యేం ఫిగర్....అందగత్తె కాదు - కాని ఆమెలో ఏదో ఆకర్షణ....దీన్నే గాబోలు యింగ్లీషులో స్మార్ట్‌నెస్ అంటారు. ఉత్తి స్మార్ట్‌నెస్సే కాదు సెక్సీగా వుంది. ఈ లలనామణి హఠాత్తుగా ఎక్కడనించి వచ్చిపడింది. అసలెవరు? ఇన్నాళ్లు తన కళ్లు ఎలా మూసుకుపోయాయి? వాటె లక్కీ డే....ఓహో... ఆ పల్లెటూరి డ్రస్సులోనే యింత ఆకర్షణీయంగా వుంది. కాస్త నాజూకు డ్రసింగ్ అవుతే ...ఆమె వలువల్ని తలపుల్లో వలిచి చూసి ఆనందిస్తున్నాడు. అళగా, అబగా... అలికిడికి తలెత్తి చూసిన రంగడు యజమానిని చూసి తడబిడ పడ్డాడు. రంగడు నిశ్శబ్దం అయిపోగానే తలెత్తిన సీతాలు....రమేష్‌ని చూసి సిగ్గుతో మెలికలు తిరిగి ఒక్క గెంతుతో రంగడి వెనక్కి పరిగెత్తింది.

"రంగా....ఎవర్రా...." అన్నాడు రమేష్ కళ్ళెగరేసి సీతాలుని చూపిస్తూ.

"మా ఆడదండి...." రంగడు సిగ్గుపడ్తూ అన్నాడు.

"ఓహో........పెళ్ళాడావా........యెప్పుడు....?"

"మొన్నేనండి, ఆర్నెల్లయిందండి...."

"అలాగా....మరిన్నాళ్ళూ....ఎప్పుడూ చూడలేదే...." సీతాలునే మింగేసేటట్టు చూస్తూ అన్నాడు రమేష్.

"అల్లమ్మకి వల్లు బాగునేదంటే కన్నోరింటికెళ్ళి నిన్నే వచ్చిందండి...."

"అదా సంగతి....ఒరేయ్ నీ పెళ్ళాం బాగుందిరా....మంచి పెళ్ళాన్నే సంపాదించావు. పేరేంటిరా?...." చనువుగా అడిగాడు.

"సీతాలచ్మండి....సీతా లంటానండి...." యజమాని భార్యని పొగిడినందుకు సంబరంగా, గర్వంగా సీతాలువంక చూశాడు రంగడు.

సీతాలు సిగ్గులమొగ్గ అయింది. కళ్ళ చివర్లనించి చిన్నదొర మిసమిసలాడే రంగుని, వేసుకున్న ఖరీదయిన నైట్ సూట్, మెరిసే నల్ల చెప్పులమధ్య మల్లెపూవు లాంటి కాళ్ళని, నిగనిగలాడే వంకీల క్రాపుని, చేతికున్న ఖరీదయిన వాచిని ....అన్నీ చూసి అబ్బో చిన్నదొర ఎంత బాగున్నాడనుకుంది సీతాలు.

"వరేయ్ రంగా, మీ సీతాలేకనక సిటీలో వుంటే సినిమాస్టార్లని మించిపోయేది... కాస్త షోగ్గా డ్రస్సయిందంటే....మరి చూసుకో....మంచి ఫోటో జెనిక్ ఫేస్‌రా....అనక ఎండ తగ్గేలోపల ఫోటోలు తీస్తాను యిద్దరూ ముస్తాబయి రండిరా ....సీతాలూ మంచి చీర కట్టుకురా....రంగా....నీవూ....ఆ వేషంతీసి శుభ్రంగా రా...." అన్నాడు.

చిన్నదొర ఆదరాభిమానాలకి పొంగిపోతూ, ఫోటో తీస్తానన్నందుకు ఆనందంతో తబ్బిబ్బు అయిపోతూ యిద్దరూ దండాలు పెట్టారు. మొదటిసారే యింకా చూస్తే బాగుండదన్నట్టు రమేష్ అయిష్టంగానే అక్కడనించి కదిలి లోపలికి వెళ్ళాడు.

* * *

మధ్యాహ్నం రంగడు సీతాలు యిద్దరూఅతివుత్సాహంగాముస్తాబయి ఫోటోలకి వచ్చారు. సీతాలు అమ్మగారు తనకిచ్చిన గులాబీ నైలక్సు చీర కట్టి గులాబిరంగు జాకెట్టు తొడిగి, తోటలో గులాబీలు తలలో పెట్టుకొని నీటుగా కాటుక, బొట్టు పెట్టి తయారైంది. రంగడు రమేష్ యిచ్చిన పాతప్యాంట్ షర్టు తొడుక్కుని సంబ

రంగా సీతాలు పక్కన నిలబడ్డాడు. గులాబీ చీరలో ఉదయంకంటె ఆకర్షణీయంగా వున్న సీతాలుని చూసి గుటకలు మింగాడు రమేష్. అతని మెదడు చురుకుగా ఆలోచిస్తూంది. ఫోటోలు తీసే నెపంతో....'అరే....అలా మొహం వంచకూడదు.' అలాకాదు యిటుచూడాలి'— 'ఇలా నవ్వాలి'....'ఇలా దగ్గిరగా నిలబడు' అంటూ గడ్డం ఎత్తి-బుజాలు పట్టుకుని....అనేక రకాల పోజుల్లో నిలబెట్టాడు ఆమెని తాకుతూ...సీతాలు చిన్న దొరగారి స్పర్శకు ముడుచుకుపోతూంటే-"ఏటే అలా మెలికలు తిరగ తండవు. దొర చెప్పినట్టు చూడు" అన్నాడు రంగడు. ఫోటోల కార్యక్రమం అయ్యాక—'వరేయ్ రంగ మేడమీదకి రండిరా పాటలు విందురుగాని. రా సీతాలూ నా దగ్గర అంత సిగ్గేమిటి"

అయ్యగారి యీ ఆకస్మిక ఆదరణ అర్థంకాక ఆనందంతో తికమకలయిపోయాడు రంగడు "రావే....పాట అంటే నీ కిష్టంకాదే యిందాం రా" సిగ్గుపడుతున్న సీతాలుని లాక్కెళ్ళినట్టే చేయిపట్టి తీసికెళ్ళాడు రంగడు. రేడియోగ్రాములో తెలుగు రికార్డులు పెట్టాడు రమేష్. తన కిష్టమైన తెలుగు పాటవింటూ రికార్డు ప్లేయర్ తిరగడం ఆశ్చర్యంగా ఆనందంగా చూస్తూ, చిన్న బాబుగారి గదిలో మెత్తని పక్క, ఖరీదయిన దుప్పటి, డ్రస్సింగ్ టేబిల్ వగైరాలని గమనిస్తూంది సీతాలు. రమేష్ జేబులోంచి సిగరెట్ పెట్టెతీసి ఖాళీగా వుండడంచూసి విసిరేస్తూ 'రంగా, ఓ సిగరెట్ పేకట్ పట్రా బజారువెళ్ళి....' అన్నాడు ఐదు రూపాయలు అందిస్తూ. రంగడు పాట మధ్యలో వెళ్ళడం యిష్టంలేక యిబ్బందిగా కదిలాడు. సీతాలు లేచి వెళ్ళబోయింది. 'అరే, నీవెందుకు వెళ్ళిపోతావు, కూర్చుని పాట విను, సిగరెట్ పాకట్ తీసుకుని యిప్పుడేగా వచ్చేస్తాడు' అన్నాడు రమేష్. రంగడు ఏమనలేక వెళ్ళిపోయాడు. సీతాలు యిబ్బందిగా సిగ్గుగా కూర్చుంది. రమేష్ డ్రస్సింగ్ టేబిల్మీదనించి సెంట్ స్ప్రేతీసి సీతాలుమీద స్ప్రే చేస్తూ నవ్వి....'వాసన బాగుందా చూసుకో ఎంత మంచివాసన వేస్తున్నావో. నీకు కావాలా' అన్నాడు స్ప్రే చూపిస్తూ. సీతాలు ఆ సువాసనని ఆఘ్రాణిస్తూ సిగ్గుగా నవ్వి తల అడ్డంగా ఆడించింది.

'సీతాలూ నీ కీ చీర ఎంత బాగుందో తెలుసా....మంచి తెల్ల చీర కట్టుకుంటే యింకా మిల మిల మెరిసిపోతావు. నేను తెప్పిస్తా నీవొక చీర కొనుక్కో. అదేంటలా సిగ్గుపడతావు. చూడు నా వైపు. అరే....అరే నీవలా సిగ్గుపడ్తూంటే ఎంత బాగున్నావో తెలుసా' ఆమె గడ్డం ఎత్తిపట్టి కళ్ళలోకి కొంటెగా చూపాడు రమేష్. సీతాలు నిలువెల్లా పులకరించింది. చినబాబుగారి సువాసన తలనూనె, వంటికి రాసుకున్న పౌడరు వాసన, బట్టలని ఫారిన్ సెంటు అన్ని సువాసనలమధ్య ఆ మెరిసిపోతున్న రంగు, మాటల్లో చూపుల్లో కొంటెతనం. చినబాబు తనమీద చూపించే శ్రద్ధా-అతని పొగడ్తలు అన్నీ కలిసి సీతాలుని వివశురాలిని చేసేసాయి.

కళ్ళెత్తి రమేష్ మొహంలోకి చూడలేకపోయింది. 'సీతాలు ఇదిగో యిటుచూడు. నేనంటే నీకు యిష్టమేనా. నేను బాగున్నానా లేదా చెప్పాలి. మరి నీ రంగడి కన్నా బాగున్నానా లేదా. ఇదిగో యీ దూరు రూపాయలు తీసికెళ్ళి మంచి తెల్ల జరీచీర కొనుక్కో" అంటూ చేతిలో కుక్కాడు నోటు. "అమ్మో వద్దండి. మావే టంటాడో—" భయంగా అంది.

"ఏమనడు - నేనిచ్చానని చెపుతాలే....చూడు-రాత్రి రంగడు పడుకున్నాక మెల్లిగా యీ గదిలోకి రా. తలుపుతీసి వుంచుతా, ముందువైపునించి కాక వెనక వైపు తలుపుతీసి వుంచుతా. మెల్లెక్కిరా. ఎవరూ చూడరు. పదకొండు దాటాక—యిటు చూడు యీ కిటికీలోంచి బ్యాటరీలైటు యిలా వెలిగిస్తా....రంగడు నిద్రపోయాడో లేదో చూసి వచ్చేయి...." మెల్లిగా ఆమె బుజంమీద చెయ్యివేసి నొక్కి తమకంగా చూస్తూ అన్నాడు. సీతాలు అర్థంకానట్టు తెల్ల పోతూ చూసింది. "ఏమిటలా చూస్తావు-అర్థం కాలేదా....సీతాలూ పొద్దుట నిన్ను చూసిం దగ్గిరనించి నా మనసు మనసులోలేదు....సీతాలు నీవెంత బాగున్నవో తెలుసా...." అంటూ చటుక్కున సీతాలు పెదాలమీద ముద్దు పెట్టుకుని "అదిగో రంగడొచ్చేస్తాడు. రాత్రికి మరిచిపోకు" అంటూ బుగ్గలు వేలితో రాసి చిటికెవేసి వెళ్ళి తన కుర్చీలో కూర్చు న్నాడు. చిన్నదొరలాంటి పెద్దింటి బిడ్డ....అంత గొప్పవాడు తన అందాన్ని మెచ్చి, తనని కోరాడు....ఆ పెదాలమీద ఆ ముద్దు అతని మాటలు, చేష్టలు, ఆ దబ్బు.... ఆ అందం, ఆ హోదా అన్నీ కలిపి సీతాలు మతి పోగొట్టేశాయి. బాహ్యస్మృతి కోల్పోయిన దానిలా మంత్ర ముగ్ధలా అలా వుండిపోయింది.

* * * *

వారం రోజులు గడిచాయి. ఆ రోజు ఉదయం రంగడు గుర్రానికి మాలిష్ చేస్తున్నాడన్న మాటేగాని వాడి మనసు మనసులో లేదు. వాడి మనసులో రగిలే ఉద్రేకం చేతుల్లో చూపిస్తూ గుర్రాన్ని జోరుగా బర బర మాలిష్ చేస్తున్నాడు. వాడి మనసు, శరీరం ఉక్రోషంతో, అవమానంతో, కోపంతో ఉడికిపోతోంది. రాత్రినించి ఏదో చెయ్యాలి, ఏదో చేసి కసి తీర్చుకోవాలన్న కక్ష నిలవనీయడం లేదు. నిన్న రాత్రి....గురించి తలుచుకున్న కొద్దీ వాడి వళ్ళు సలసల కాగిపోతుంది. నిన్న రాత్రి చటుక్కున ఎందుకో మెలకువ వచ్చింది. పక్కన సీతాలులేదు. పెరట్లో కెళ్ళిందేమో వచ్చేస్తుందేమోనని కాసేపు అలా నిద్రమత్తులోనే చూశాడు. అరగంట దాటినా రాలేదు. రంగడు చటుక్కున లేచి చూశాడు—తలుపు చేరేసి వుంది. పెరట్లో చూశాడు లేదు. సీతాలూ అని పిలిచాడు పలకలేదు. రంగడిలో ఏదో అనుమానం చోటు చేసుకుంది. వారం రోజులనించి సీతాలు ప్రవర్తన వింతగా

వుంది. మనిషి ఏదో పరధ్యానంగా వుంటూంది. ఇదివరకులా నవ్వుతూ సరదాగా మాట్లాడడంలేదు. పిలిస్తే విసుక్కుంటుంది. దగ్గిరకొస్తే చీదరించు కుంటుంది. ఏమడిగినా ఏం లేదంటుంది. ఎంతసేపూ చిన్న బాబుగారిచ్చిన పౌడరు, స్నోలు, సెంట్లు పూసుకుని ముస్తాబయి అద్దంలో చూసుకుని మురిసిపోతూంది. సాయంత్రం అయ్యేసరికి ఇదివరకు లేనిది కొత్తగా స్నానంచేసి బజార్లో కొన్న తెల్లచీర కట్టుకు ముస్తాబవడం చూసి మొదటిరోజు సంతోషించాడు. తీరా ఆ ముస్తాబు తన కోసం కాదన్నట్టు సీతాలు రంగడిని దగ్గిరకి రానీయకుండా తల నొప్పంటూ మూలుగుతూ పడుకుంది. వారంనించీ రోజూ ఏదో వంక....మూడు రోజులు స్నానం కాలేదంది....ఏదో చెపుతూంది. ఓ రాత్రి సీతాలు పక్కలో లేదు. లేచి చూసే వేళకి బయటనించి తలుపు తీసుకువచ్చి పడుకుంది. ఎక్కడికెళ్లావంటే బయట ఏదో చప్పుడయితే చూసానంది. సీతాలు వ్యవహారం, అవతల చిన్న దొర వ్యవహారం....ఎప్పుడూ సీతాలేది అని అడగడం రికార్డులు పెట్టి వినమనడం, స్నోలు పౌడర్లు నీ పెళ్ళానికీయరా అని ఉదారంగా యీయడం, అడక్కుండానే పాత ప్యాంట్లు షర్టులు ఇచ్చాడు. సీతాలుతో ఎంతో చనువుగా మాట్లాడుతాడు. ఇద్దరూ తన ఎదురుగానే నవ్వుకుంటారు....ఏదో అనుమానం తొంగిచూసినా చిన్న దొర ఉదారం ముందు అణగారిపోయింది. నిన్న రాత్రి సీతాలు ఎంతకీ రాకపోతే, ఆ అనుమానం బలపడింది....అలా నడిచి భవంతి ముందువైపు వచ్చాడు. చిన్న దొర గదికింద నిలబడ్డాడు. చిన్నగా ఏవో మాటలు నవ్వులు వినపడ్డాయి. అలా చీకట్లో దెయ్యంలా నిలబడ్డాడు రంగడు.... ఓ రెండు గంటల తరువాత సీతాలు కిందకివచ్చి గుడిసెవైపు వెళ్ళింది. రంగడు ఒక్క ఉదుకున సీతాలు జుట్టు పట్టుకు బరబర గుడిసెలోకి యీడ్చుకువెళ్ళి శక్తి వున్నంతవరకు బాదాడు. సీతాలు కుక్కురి బిక్కురి మనకుండా ఏడ్చింది. సీతాలుని కొట్టి అలిసిపోయిన రంగడు— కొట్టాల్సింది సీతాలుని కాదని, సీతాలుని మభ్యపెట్టి వల విసిరిన చిన్న దొరనని గ్రహించాడు. ఇంత ద్రోహమా-యింత అన్యాయమా-ఇంత ఘోరమా....వాళ్ళ కాళ్ళకింద బతికేవాళ్ళమని యింత అలుసా....ఉడికిపోయాడు. తనకింత ద్రోహం చేసిన చిన్న దొరని వదలకూడదు—వదలడు!- పరపర గుర్రానికి మాలిష్ చేస్తున్న రంగడి మెదడులో ఆలోచన మెరిసింది.

చకచక పరిగెత్తినట్టే పొలాలకి అడ్డంపడి కొండలవైపువెళ్ళి తనక్కావలసిన ఆకులు కొన్ని తుంపి తీసుకువచ్చాడు. గడ్డితోకలిపి గుర్రానికి దగ్గిరుండి తిని పించాడు. గుర్రపు కళ్ళెం తీశాడు. గుర్రంలాగే ఆ కళ్ళెమూ పాతబడింది.

[ 6 ]

తోలుపటకా చాలాచోట్ల పాతబడి, నలిగి ముడతలుపడి తెగిపోవడానికి సిద్ధంగా వుంది. గడ్డికోసే కత్తితీసి తెగిపోవడానికి సిద్ధంగావున్న ఆ గాట్లని మరింత కోశాడు కాస్త పట్టువదలి....గుర్రానికి జీనువేసి రెడీ చేశాడు.

రమేష్ యథాప్రకారం నిద్రలేచి బెడ్‌కాఫీ సేవించి గుర్రపుస్వారికి బయలు దేరాడు ఉత్సాహంగా. ఈ వారంగా రమేష్ ఉత్సాహంగా వుంటున్నాడు. కాస్త విసుగు తగ్గి కులాసాగా వున్నాడు....పనులన్నీ చకచక పూర్తి చేస్తున్నాడు. యింక నాలుగైదు రోజులలో పూర్తి కావచ్చు. యీలోగా కాలక్షేపానికి సీతాలు బాగా పనికొచ్చింది. ఆ ఉత్సాహంతో గుర్రాన్ని అదిలించాడు. గుర్రం సకిలించింది.... కదలడానికి ఎందుకో మొరాయించింది. గింజుకుంది. "ఏంరా, ఏం వచ్చింది దీని కివాళ-" రంగడిని అడిగాడు!

"ఏం లేదు దొరా, యిన్నాళ్ళు బద్ధకం బలిసి యిప్పుడు పరిగెత్తాలంటే వళ్ళు వంగడంలేదు రెండు తగిలించండి-" అన్నాడు. రమేష్ కాలితో గుర్రం డొక్కలో తన్ని కళ్ళెంతో అదిలించాడు. డొక్కపోటు తిన్న గుర్రం పౌరుషంగా ముందు కురికింది. తిన్న ఆకుల పసరు పనిచేయడం ఆరంభించి పిచ్చి పట్టిన దానిలా పరుగు లంకించుకుంది. ఆ పరుగు....అసహజంగా వుందని పించినా చాలా రోజుల తర్వాత గుర్రంమీద యింత జోరుగా సవారి చెయ్యడం ఉత్సాహమనిపించి కళ్ళెంతో యింకాస్త అదిలించాడు. గుర్రం వెర్రి ఆవేశంతో పొలాలు గట్లుదాటి కొండవాలు మీదకి పరిగెత్తింది. రాళ్ళు రప్పలు, చెట్లు చేమలు దాటి దుముకుతూ....ఎంతో వేగంగా పరిగెడుతున్న ఆ వేగానికి మొదటిసారిగా రమేష్ భయపడి కళ్ళాలు బిగించి లాగాడు. గుర్రం ఆగలేదు. శివం ఎత్తిన దానిలా ఆ పరుగు ఆ జోరుచూసి రమేష్‌కి చెమటలు పట్టాయి. భయంతో గుర్రాన్ని అదుపులో పెట్టడానికి కళ్ళెం మరింత జోరుగా బిగించి లాగాడు. పటుక్కున కళ్ళెం తెగి తోలు పటకా చేతిలోకి వచ్చేసింది—రమేష్ బిత్తరపోయాడు. కళ్ళెం వదులయిపోవడంతో మరింత అడ్డు అదుపు లేనట్టు పిచ్చిగా పరిగెత్తసాగింది గుర్రం-ఆ వేగానికి తట్టుకోలేక బోర్లా గుర్రాన్ని కరుచుకుపోయి పిచ్చిగా గుర్రాన్ని ఆపాలని వ్యర్థప్రయత్నాలు చేస్తూ కేకలుపెట్టసాగాడు. ఆ కేకలకి హడలిపోయిన దానిలా గుర్రం ఎటు వెడుతున్నదీ తెలీకుండా గుట్టలు, రాళ్ళు దుమికేస్తూంది— కొండ యెక్కేసింది. అవతల కొండవాలులోకి దిగడం ఆరంభించి పల్లంలోకి మరింత వేగంగా జారిపోతూ పరిగెడ్తూంది....రమేష్ పై ప్రాణాలు పైనే పోయాయి....కళ్ళు గట్టిగా మూసుకున్నాడు. గుర్రం కాలు ఓ కొండరాయిమీద మడతపడి. జారిపడి వేగంగా కిందకి దొరుకుంటూ పడిపోసాగింది—గుర్రంతో

పాటు రమేష్ అతి ఘోరంగా కొండరాళ్ళ వెంట దొర్లి దొర్లి కింద లోయలోకి విసిరేయబడ్డాడు. అతని ఆర్తనాదం కొండల్లో ప్రతిధ్వనించింది.

"గుర్రపు కళ్ళెం"- అదుపులేకుండా పరిగెత్తే గుర్రాన్ని బంధించడానికే కాదు,—ముడిపడ్డ బంధాలని తెంచడానికి పనికొస్తుంది.

(జ్యోతి (దీపావళి సంచిక) సౌజన్యంతో)

★

# అమ్మాయిలూ తొందరపడకండి!

ఓ చేతిలో ఏణ్ణర్థం పాప, రెండో చేత్తో బరువయిన ప్లాస్టిక్ బ్యాగు, భుజానికి నిండుగావున్న హ్యాండుబ్యాగుతో బస్సుకోసం ఎదురుచూస్తూ అసహనంగా నిల్చుంది భారతి. ఎండాకాలం ఏమో ఉదయం ఎనిమిదిన్నరకే ఎండ చుర్రుమంటోంది. ఉక్క చెమట, చీదరతో చేతిలో పాప చిరాగ్గా ఏడుస్తోంది. చేతిలో బరువు, దానికి తోడు పాప ఏడుపు. రాని బస్సుకోసం ఎదురుచూపుతో నీరసం వస్తోంది భారతికి. పిల్లని నేలమీద కూలేసి కింద కూలబడాలన్నంత చిరాగ్గా వుంది ఆమెకి. ఏమున్నా ఏం లేకపోయినా మధ్యతరగతి మధ్య సంస్కారం వుంది కనక అంత పనీ చెయ్యలేక చేతిలో పిల్లవైపు గుడ్లురుమిచూసి భయపెడ్తూ, గొణుక్కుంది.

"భారతీ....నువ్వేనా....దూరంనుంచి చూసి నువ్వాకాదా అనుకున్నాను....యిదేమిటే యిలా అయిపోయావు?" గొంతువిని చటుక్కున తలతిప్పి చూసింది భారతి—సునయన!—పేరులాగే పెద్దకళ్ళతో అందంగా వున్న సునయన. బి.ఏ.లో క్లాస్‌మేట్—ఏమిటలా చూస్తున్నావు. గుర్తుపట్టలేదా? సునయన నవ్వుతూ అంది. 'ఆ....ఆ....గుర్తొందుకుపట్టను' హఠాత్తుగా కనిపిస్తే....ఏం చేస్తున్నావు! యీ వూర్లోనే వుంటున్నావా? పెళ్ళయిందా? లేక వుద్యోగమా? భారతి ప్రశ్నలు కురిపించింది. ఆరోగ్యంతో మిసమిసలాడుతూ, ఖరీదయిన బట్టల్లో అందంగా మెరిసిపోతున్న ఆమెని చూసి భారతి మనసు క్రుంగిపోయింది.

"పెళ్ళయింది. మావారు యింజనీరు—క్రాంప్టన్ గ్రీవ్స్‌లో పని. పెద్ద కంపెనీకదా మంచి జీతం, యిల్లు, కారు అవన్నీయిచ్చారులే. నువ్వేమిటి యిలా